Kavisangamam Books



# కలామ్ సలామ్!

కవిసంగమం - ఫేస్బుక్ గ్రూప్ :

వచనకవిత్వం గురించి, కవిత్వసృజన,సంబంధిత అంశాల గురించి నిరంతర సంభాషణ కొరకు ఒక వేదికగా ఏర్పడిన ఫేస్ బుక్ సమూహం

https://www.facebook.com/groups/kavisangamam/

కవి యాకూబ్

# పారడాక్స్

నిన్న, అంతకుమునుపు నువ్వున్నావు

కాని నిన్న నువ్ ఇటువైపు నుండే
వెళుతూ కనిపించినా కనీసం ఒక్క నిమిషాన్నికూడా
నీకోసం కేటాయించలేక పోయాం.

ఇక్కడికి దగ్గర్లోనే నువ్ మాట్లాడుతున్నా
మర్యాదకైనా, గౌరవంగానైనా
కనీసం నీకోసం కొంత సమయాన్ని కేటాయించలేక
పోయాం.

*

ఇప్పుడేమో నువ్వు చనిపోయావు
చూడు, నీకోసం ఎంత సమయాన్ని
కేటాయిస్తున్నామో ?!
ఎంత దుఃఖపడుతున్నామో !?

28.7.2015

జి.వి.రత్నాకర్

# డా. ఏ. పి. జె. అబ్దుల్ కలామ్ గారికి స్మృతిగా..

పవిత్ర దేశమా!

నేను

హిందువునూ

ఏ బిందువునూ

కాదంటున్నాడు

ఓ మనిషి

నేలకి

రంగు రూపు ఆయినోళ్ళు

ఏమి కానోల్లయి

ఊరేలపలి

పొలిమెరలౌతున్నారు

ఒకడు

మట్టిని బువ్వ చేస్తుంటే

మరోడు

తరాలుగా ఆరాగిస్తున్నాడు

నల్లటి

'ఆ' చెట్టు

కన్నీళ్లు కారుస్తుంటే

ఆడు కుండకి బొక్కెట్టి

సొరగలోకమౌతాడు

ఆ అణు బాంబుకి

అకారమైన సాయిబు

క్రికెట్ ఆటకి

అంటరానోడౌతున్నాడు

నాకు

అచ్చురమే వద్దన్నోడు

వేతనాల పెంపు

పోరాటమైతున్నాడు

భూమి

గుండ్రంగానే ఉంది

అచ్చరాలని

ఆలోచనలని

నడిపిస్తున్న మనిషి

ప్రశ్నిస్తున్నాడు

పవిత్ర దేశమా!

ఈ పాపమెవ్వరిది?

*******

మట్టి పలక 3/2/1999

కట్టా శ్రీనివాస్

# అగ్గిరెక్కల మనిషి

నిప్పు రెక్కల మిస్సైల్ ఒకటి కూలిపోవడం నేను చూసాను.

జ్ఞాన ఇంధనంతో స్వయంగా పై కెగసి

ఎన్నో దారితప్పి యంత్రాలను మంత్రం వేసినట్లు దారిలోకి తెచ్చే

మిస్సైల్ ఒకటి కూలిపోవడం నేను చూసాను.

రత్నాలూ, భూషణాలూ,విభూషణాలకంటే

భాషణంలోనే మైమరచే ఆ గొంతు

గుండె చివరి గంట కొట్టేవరకూ మాట్లాడుతూనే కూలటం నేను చూసాను.

మైండ్స్ కి ఇగ్నీషన్ ఇచ్చిన మిస్సైల్

ఇరపై నాటికి ఇండియా ఇంకెంతో అవ్వాలనుకున్న మిస్సైల్

నాన్న పడవ ఒడినుంచి పరుగులెత్తి ప్రవహించి నింగిదాకా

సాగిన మిస్సైల్

నిశ్శబ్ధంగా ఒక నిరామయ నిశీధిలోకి జారిపోవడం

నేన్చూశాను.

రాష్ట్రపతి, కవి, శాస్త్రవేత్త అయితే మళ్ళీ దొరుకుతారేమో

ఒక మనిషిదనాన్ని నిండానింపుకున్న పరుగులెత్తే

మిస్సైల్ రాలిపోవడాన్ని తడికళ్లతో చూసాను.

తనే ఒక పుస్తకమైన నిరంతర జీవనం ఆగిపోవడం

చూసాను.

దేశపు కన్నీళ్ళ వర్షంలోంచి

కనీసం ఒక్క చిరుమొలక రావడాన్ని చూడాలి.

విత్తనాలు పెదజల్లిన ఆశయం చిరునవ్వై పూయడాన్ని

చూడాలి.

28-జులై-2015

నివాళిగా

http://antharlochana.blogspot.in/2015/07/blog-post_28.html

=> రత్న (1997), భూషణ్ (1981), విభూషణ్ (1990)

=> వింగ్స్ ఆఫ్ ఫైర్: ఎన్ ఆటోబయోగ్రఫీ ఆఫ్

ఏ.పి.జె.అబ్దుల్ కలామ్ - ఏ.పి.జె.అబ్దుల్ కలామ్, అరుణ్ తివారీ

=> తండ్రి జైనులుద్దీన్, పడవ యజమాని

వర్మ కలిదిండి

# ప్రవక్త

ఒక పురా స్వప్నం నెరవేరకముందే
కుప్పకూలిన ప్రవక్త
ఈ నిజం కలగా మిగిలిపోతే బాగుండు

మనిషిని అంతరిక్షంలోకి ఎగురవేసి
గుండెకి రాకెట్టుని కవాటంగా అమర్చగలవాడు
మట్టిని పల్లెని
మేనంతా పూసుకొని తిరిగిన వాడు
పిల్లలు కలలు
దేశమంతా సాకారమవ్వాలని పలికిన వాడు

నా ఆకుపచ్చని కల
ఆతని పురా సంస్కృతి
నా విశ్వ మానవ జాతికి
ఆయనొక ప్రవక్త
ప్రవక్తే; ఆయన

తక్షణం కలగనటం నా విధి

మరో కలాం పుట్టడం నా స్వప్నం...

27.07.2015

**విరించి విరివింటి**

# ఒక్క రోజు సెలవు

హృదయాల మీద లిఖించగలిగే నాలిక అది
కలల్ని వర్షించే కన్నులవి
జ్ఞానాన్ని పసితనంగా అందించే నవ్వులవి
భవిష్యత్తుతో స్నేహించే చేతులవి
మనిషిని సమున్నతంగా నిలిపే పాదాలవి.

ఎందుకో ..ఈరోజొక సెలవు కోరింది.
అలసట తీర్చుకోవటానికి కాదు,
రేపటి రోజున మరో చరిత్రె పుట్టేటందుకొక సెలవడిగింది.
రగిలించిన మెదడుకి ప్రాణంతో పని ఏమని ప్రశ్నిస్తూ..
ఈ ఒక్క రోజుకి కాస్త సెలవడిగింది.

ఈ సాయంత్రం ఒకచుక్క నేలరాలితే..
ఈ దేశపు ఆకాశం కన్నీటి చుక్కల్ని మోసింది.
నడిచే గ్రంథాలయం మూసుకుపోయింది.
కలల కర్మాగారం మూతపడింది.
చరిత్ర పుస్తకం అశ్రు నయనాలతో ఆహ్వానించింది.

ఒక ఆలోచన తన స్వేచ్ఛను ప్రకటించుకుంది.
అగ్ని రెక్కలతో నింగికెగసింది.
అజ్ఞానానికి అందని ఆత్మ నంటూ
తన ప్రయాణం నింగి వైపంటూ
మిస్సైల్లా దూసుకుపోయింది.

ఆచరణలో ఈ స్వప్నం ఒక మిస్సైల్ మాత్రమే
మనిషిగా ఆయనొక మెస్సైయ్య.

(మహనీయుడు, చివరి క్షణం వరకు జ్ఞానాన్నే శ్వాసించిన
వాడు, నిరంతర స్ఫూర్తి ప్రదాత, శాస్త్రవేత్త
మాజీ రాష్ట్రపతి శ్రీ అబ్దుల్ కలాం పాదాలకి అశ్రు నివాళి.)

కంచర్ల శ్రీనివాస్

# కలాం తుఝెసలాం..

హే.. ఎం జర్నలిస్ట్ వయ్యా నీ కన్నా నేనే నయం

కలాం సార్ చనిపోయారట..దెప్పి పొడిచిన నా శ్రీమతి

గళం

ఆలస్యంగా గ్రహించిన నా అక్షరం

అవాక్కైన క్షణం

సాంకేతిక సాధనాలకు దూరంగా

నిన్నంతా నేను

శాస్త్ర సాంకేతిక రంగాల్లో

దేశవికాసం స్వప్నించిన పుష్పం

రాలిపోయిందన్న సత్యం

మహనీయుని మరణం

దిగంతాల్లో దాగున్న దుఖం

ఎగదన్నుకొచ్చిన తరుణం

భారతావని కీర్తి

హిమశిఖర సమున్నితానికై తపించిన మహర్షి..

దేశ ఖ్యాతి పతాకం

గగన వీధుల్లో రివ్వున ఎగరేయాలని శ్వాసించిన రాజర్షి..

మరణం అందరికీ అనివార్యమే

అంతిమ క్షణం కూడా అందంగా ఉంటుందని

చాటి చెప్పిన స్వేచ్ఛా గీతమా.. శాంతి కపోతమా

కలాం తురేఖుసలాం..

ఎన్ని పూలు విరిసేవో నీ నిష్కల్మశ మందహాసంలో

పసి పాపల బోసి నవ్వుల్లో భావి భారత సమాజ భవిశ్యత్తులో

నీ రూపం నీ నవ్వుల ప్రతి రూపం సజీవం..

కార్తికేయ శర్మ

నింగిలో తారల మధ్య నిన్నొక తార వచ్చి నిలిచింది .....

భూమిపై వున్నపుడు..

భారతరత్నమై వెలిగింది...

ఆకాశాన్ని చుంబించే రాకెట్లను తయారు చేసింది...

శత్రు భయంకర క్షిపణులను రూపొందించింది .....

జాతిలో దేశభక్తిని రగిలించింది ...

యువతకు కలలు నేర్పించింది ....

పిల్లల్లో ప్రశ్నలు మొలకెత్తించింది ...

ప్రజల రాజుగా నిలిచింది ....

కలల బలం చూపించింది ....

మేధస్సును మధిస్తూ, మధిస్తూ ...

మన కంట కన్నీరు నింపి నింగికెగసింది ....

మచ్చ నెరుగని "మార్గదర్శిగా " స్ఫూర్తి నింపింది ...

(ఈ కవితకు వివరణ అక్కరలేదు... ఎవరి గురించి రాశానో విదితం

చేయవలసిన అవసరం లేదు అందుకే ఈ కవితకు పేరు లేదు)

**రవికుమార్ బడుగు**

# వింగ్స్ ఆఫ్ ఇండియా

నింగిని నేలకి దింపిన

కలలక్షిపణి కన్నుమూస్తుందా..

అగ్నికి రెక్కలు తొడిగినవాడి

ఆత్మకు అంతముంటుందా..

మతాల చిత్తుకాగితాల కింద నలిగిపోయిన

మన సైన్స్ కి అంతరిక్షపు దారి చూపినవాడు

జాతికి అణురక్షణై నిలిచినవాడు

ఎప్పటికీ మనవెంటే ఉంటాడు..

కన్నీరు పెడుతున్న కలకి

కాస్తంత ధైర్యం చెప్పండి

ఆయన వెలిగించిన అగ్ని అమరజ్యోతి అని..

అదే ఈ దేశపు యువతకి నిత్యస్ఫూర్తి అని..!

వైష్ణవీ రావు

# భరత వెలుగు ..

# మన కలాం..

ఆశయాలకు పేదరికం అడ్డుకాదని

ఊహలకు రెక్కలు తొడిగి

తెలివితేటలకు మెరుగులు దిద్ది

ఆలోచనలను

ఏకలవ్యుడి బాణంలా ఎక్కుపెట్టి

లక్ష్యసాధనే ఊపిరిగా

లక్ష మెదళ్ళకు ధీటుగా

అణుపరీక్షలో

తొలిమజిలీలోనే

కీర్తి పతాకాన్ని ఎగురవేసి

మిస్సైల్ లా

అందరి మనసుల్లోకి దూసుకుపోయి

రాజ్యాధిపతిగా..పీఠానికి వన్నె తెచ్చి

విద్యార్థులకు స్ఫూర్తినిచ్చి
"పద్మభూషణ్" ను అలంకరించినా..
స్మితభాషణమే..భూషణంగా
మానవత్వమే మతంగా
చిరునవ్వులను వెదజల్లి
అందరి మన్ననలు పొంది
భరతమాత బావుటాన్ని
ప్రపంచపుటంచులపై
ఎగురవేసిన మహనీయుడు
నిస్వార్ధ పక్షపాతి
"భారతరత్న"గా..
నిత్యం నింగిలో
వెలుగొందే ధృవతార..
భరత వెలుగు ..మన కలాం..

జలిగామ నరసింహరావు

# కలాం మీకు సలాం

ఓ మహానేత!

ఓ మహా విజ్ఞాని!

ఓ మహా మానవతా వాది!

ఓ మహా దిక్సూచికా!

ఓ మహా మహా మార్గదర్శికా!

..................మా కలాం మీకు సలాం

మహా సౌధం నిర్మించాలంటే మేలిమి పునాది రాళ్లేనని

నమ్మి

విధ్యార్థులను యువతను చైతన్యపరిచి

భావి భారత కీర్తి శిఖర సౌధానికి

మీ చైతన్య భాషణములతో

ఉక్కు పునాది రాళ్లుగా

తీర్చిదిద్దిన ఓ సిద్ధాంతి

..............మా కలాం మీకు సలాం

మీ జీవితాన్నే పణంగా పెట్టి

మీ కష్టాల్ని శిఖరపు మెట్లగా మార్చి

మీ కన్నీళ్లను పసి నవ్వుతో బంధించి

దారిద్ర్యాన్ని విజ్ఞానంతో ఊరడించి

మిస్సైల్ యంత్రాలతో శత్రువుల బెదిరించి

భారత గర్వాన్ని గౌరవాన్ని ఎవరెస్ట్ శిఖరాన నిలబెట్టి

జాతి సేవకు మీ జీవితాన్నే అంకితమిచ్చిన

...............మా కలాం మీకు సలాం

సాదించింది ఏమీ లేదని

సాధనమే జీవన గమ్యమని

విజయం లక్ష్యం చేరుకుంటే అది ఒక మెట్టేనని

కలలను కనమని

సాధించేవరకు పోరాడమని

మీ నిర్దేశనం భవితకు బంగారం

..............మా కలాం మీకు సలాం

మార్గాల నేర్పి

చైతన్య ఊపిరి నింపి

పేదవాడిలో నమ్మకపు ఊపిరి పోసి

స్వర్గానికేగిన ఓ మహాన్విత
మా బాదాల తీర్చేదేవరు
బాద్యతల మోసేదేవరు
అశ్రు నివాలితో
మా కలాం మీకు సలాం

**Swatee Sripada**

THE LIFE TREE

Abdul Kalam Azad

(Composed in celebration of Human Life)

Oh, my human race,

How, we were born,

In the Universe of near infinity,

Are we alone?

I was seeking answer for the great

Question of creation, weighing heavy

My mind as I am in seventieth orbit

Around sun, my little habitat, the star

Where my race living, lived billions of years

And will live billions of years, till the sun shines.

This is the millennium question of humanity,

And sought the help of our creator.
On the eventful day, I was flying
The earth below me, the human habitat
Vanished in the white river of cloud,
Silent, turbulent free everywhere the divine
Splendour reflecting.
On the above, the full moon with its magnificent
might,
My heart melted, my friend co-passenger
Vidyasagar joined in the heavenly display.
The beauty entered into our soul
And blossomed happiness into our mind and
body.
We the humanity bowed to the heavenly answer,
We are not alone, billion of billion of lives
Of various forms spring in the planets of
Galaxy after galaxies.
Then the dawn of divine message.
There was the divine echo in the full moon night

From my creator.

Shaken, bewildered and wondered

The echo engulfed me and my race

“You, the human race is the best of my creation

You will live and live.

You give and give till you are united,

In human happiness and pain.

My bliss will be born in you

Love is continuum.

That is the mission of humanity,

You will see every day in Life Tree

You learn and learn

My best ofcreations.”

Beautiful morning it was,

Sun radiating, driving away the clouds

Parrots and Kokilas were at their musical flight

We the yellow heaven group entered

Flower garden of Asiad

Roses were in their splendour

Radiating beauty in White and Crimson
Bowing to the dawn of sun
We walked and walked, our feet o¬n the green
Meadow giving velvet touch,
Children somewhere ringing in unison in their
innocence
Peacocks in the background giving beautiful
display.
There was a majestic scene of Life Tree
Cluster of tall and straight Nag phalli grove
Undaunted to the sun rays direction
Multi layered, each flower plant bubbling with life,
We approached very close to the happy plants
Astonished to see the nature’s wonder.
Bottom layers have shed the flower all around
the sand
Whereas mid layer flower blossomed
In number to the magnificence
Perfume radiating, beauty all around

Honey bees filling the flower bed, mutual love
flowing
Intoxicated with the scene, we looked at the top
layer
Ring of the buds about to blossom
And new layers at their birth.
Again the great divine echo enters all around us
“Flowers blossom, radiate beauty and spread
perfume
And give honey.On the eve of life
Flowers silently fall to the earth, they belong.
Oh my creation this is mission of human life
You are born, live life of giving
And bond the human life
Your mission is the Life Tree.
My blessings to you my creation”.
Oh my human race
Let’s sing the song of creation.

జీవన వృక్షం

ఓ నా మానవ జాతీ

పుట్టిందెలాగ మనం

ఈ సువిశాల అనంత విశ్వంలో

మనం ఒంటరి వాళ్ళమా?

ఈ సృష్టికి అర్ధం ఏమిటనే గొప్ప సందేహానికి

జవాబు వెతుకుతున్నాను

సూర్యుని డేబ్బైయ్యో వలయాన ఉన్నందుకేమో

నా మెదడు బరుపై

నా చిన్ని నివాస ప్రపంచం ,

నా జాతి నివసించే ఒక నక్షత్రం

లక్షలాది ఏళ్ళు గడిచి లక్షలాది ఏళ్ళు

ఆచంద్రార్కం మనగలుగుతుంది

ఇది మానవజాతికే ఒక యుగ ప్రశ్న

అందుకే స్సృష్టికర్త సాయం అవసరం

ఆ ప్రత్యేక దినాన

కింద నాధరిత్రి పైన ఎగురుతూ నేను

తెల్లమబ్బులనదిలో అదృశ్యమైన మానవ జీవి
ఎక్కడచూసినా నిశ్శబ్దం కలకలపులేమి
దివ్య తేజోమయ ప్రతిరూపం
పైన పూర్ణ చంద్రుని అద్భుత శక్తి
నా హృదయం ద్రవించింది'
నా సహాయాత్రికుడు,మిత్రుడు విద్యాసాగర్
ఈ స్వర్గ ప్రదర్శనా సంరంభంలో నాతోపాటు
సౌందర్యం మా ఆత్మల్లో ప్రవేశించి
మేధో శరీరాల్లో ఆనందం పరిమళించి
మేం ఒంటరి వాళ్ళం కాదు
లక్షలలక్షలాది జీవాలు ఎన్ని రూపాలుగానో
పాలపుంతల గ్రహాల్లో వసంతాలవుతూ
అప్పుడు దివ్య సందేశపు ఉషోదయం.
ఆ నిండుపున్నమి రాత్రి నా సృష్టికర్త
దివ్య ప్రతిధ్వని
కదలిపోతూ ఒక అయోమయాన ఆశ్చర్యంతో
నాజాటినీ నన్నూ ముంచెత్తిన ప్రతిధ్వని
"మీరు, మీ మానవజాతి నా సృష్టిలో అత్యుత్తమం
మీరంతా జీవిస్తారు, జీవిస్తారు

బాధలోనూ ఆనందంలోనూ అంతా ఏకమయే వరకు
ఇస్తూనే ఉంటారు, ఇస్తూనే ఉంటారు
నా పరవశత మీలోనే
ప్రేమ నిరంతరం
అదే కదా మానవ ధ్యేయం
జీవన వృక్షాన ప్రతి రోజు ఇదే చూస్తారు
నా అద్భుత సృష్టినుమ్డి నేర్చుకుంటూనె ఉంటారు”
అందమైన ఉదయం అది
సూర్యుడు ప్రజ్వలిస్తూ మబ్బుకు దూరానికి తరలిపోతూ
రామ చిలుకలూ కోయిలలూ
తమ సంగీత ప్రవాహాన ప్రయాణాన
మా పసుపు పచ్చని స్వర్గపు గుంపు
ఏషియాడ్ పూలవనాన ప్రవేశించాం
అద్భుతమైన గులాబీలు
ఎరుపు తెలుపుల మేళవింపున
ఉదయ సూర్యునికి వందనం చేస్తూ
మెత్తని వెల్వెట్ స్పర్శ పై పదాలాంచి
మేమంతా నడిచి నడిచి
అమాయకంగా పిల్లలు ఏకస్వరాన ఎక్కడో ధ్వనిస్తూ

వెనకన అందమైన నెమళ్ళ ప్రదర్శన
జీవన వృక్షపు అద్భుత దృశ్యం
పొడవాటి పొద్దుతిరుగుడు చెట్ల సముదాయపు తోట
సూర్యముఖులై వేలుగురేఖలకు వెరవక
ప్రతి మొక్క సజీవత తొణికిసలాడగా ఎన్ని వరసలుగానో
ప్రకృతి వింతలు ఆశ్చర్యంగా వీక్షిస్తూ
ఆ ఆనందపు వృక్షాలను మేమంతా సమీపించి
చుట్తో ఇసుకమీద రాలిన కింది వరస పూల వలయం
మధ్యన వికసించినలెక్కకు మించి పూల అద్భుతం
చుట్టూ విస్తరిస్తున్న పరిమళమూ , సౌదర్యమూ
పూల మళ్ళపై నిండిన తేనెటీగలు పరస్పర ప్రేమ
ప్రవాహాలు
మైమరచిన దృశ్యాలు
పైకి చూపు సారిస్తే
విచ్చుకునేందుకు సంసిద్ధమై మొగ్గల వలయాలు
కళ్ళువిప్పే నిత్యనూతన పొరలు
మాచుట్టూ ప్రవహించే అద్భుతమైన దివ్య ప్రతిధ్వని
“పూలు వికసిస్తాయి సౌదర్యం విస్తరిస్తాయి పరిమళాలు
వెదజల్లుతాయి

తీయ తేనియనందిస్తాయి .

జీవన సంధ్యలో నిశ్శబ్దంగా పూలు తమదైన నేల

రాలతాయి.

ఓ నా ప్రకృతీ ఇదే మానవ జీవన ధ్యేయం

జననం, పరిత్యక్త జేవనం

మానవజీవన వారధి జీవనధ్యేయం జీవ వృక్షం

ప్రకృతీ నా ఆశీస్సులు నీకు

ఓ నా మానవజాతీ

మనమీ సృష్టిగీతం పాడుదాం

ప్రకృతి వింతలు ఆశ్చర్యంగా వీక్షిస్తూ

ఆ ఆనందపు వృక్షాలను మేమంతా సమీపించి

చుట్టో ఇసుకమీద రాలిన కింది వరస పూల వలయం

మధ్యన వికసించినలెక్కకు మించి పూల అద్భుతం

చుట్టూ విస్తరిస్తున్న పరిమళమూ , సౌదర్యమూ

పూల మళ్ళపై నిండిన తేనెటీగలు పరస్పర ప్రేమ

ప్రవాహాలు

మైమరచిన దృశ్యాలు

పైకి చూపు సారిస్తే

విచ్చుకునెందుకు సంసిద్ధమై మొగ్గల వలయాలు

కళ్ళువిప్పే నిత్యనూతన పొరలు
మాచుట్టూ ప్రవహించే అద్భుతమైన దివ్య ప్రతిధ్వని
“పూలు వికసిస్తాయి సౌదర్యం విస్తరిస్తాయి పరిమళాలు
వెదజల్లుతాయి
తీయ తేనియనందిస్తాయి .
జీవన సంధ్యలో నిశ్శబ్దంగా పూలు తమదైన నేల
రాలతాయి.
ఓ నా ప్రకృతీ ఇదే మానవ జీవన ధ్యేయం
జననం, పరిత్యక్త జేవనం
మానవజీవన వారధి జీవనధ్యేయం జీవ వృక్షం
ప్రకృతీ నా ఆశీస్సులు నీకు
ఓ నా మానవజాతీ
మనమీ సృష్టిగీతం పాడుదాం

కృష్ణమణి

# బుద్ధ స్మైలింగ్

అప్పుడెప్పుడో నవ్వడం మొదలు పెట్టాడు
ఇప్పటికి నవ్వుతూనే ఉన్నాడు తలెత్తుకొని
లోకానికి నేనెవరో చెప్పాడు
నేనంటే భయంతో కూడిన భక్తిని పెంచాడు !

కష్టాన్ని ప్రేమించి కలలను కన్నాడు
కలలను నిజం చేసి గర్వంగా చూసాడు !

ఒకరిపై ఆధారం వద్దన్నాడు
ఆధారానికే ఆధారమై
మనలో మొదటివాడయ్యాడు !

మనసులో గౌరవం పెంచాడు
గౌరవానికే మారుపేరయ్యాడు !

కలలను కనమన్నాడు
కలానికి రెక్కలు పుట్టించి " వింగ్స్ అఫ్ ఫైర్ " అన్నాడు !

యుద్ధమేప్పుడు వస్తుందో తెలియదు
అమ్ముల పొదిలో అస్త్రాలను నింపాడు
గుండెలో స్టెంట్లను పెట్టాడు
లేనివాన్ని గుండెను తట్టాడు

అమరుడపై వర్ధిల్లు
మా హృదయంలో పదిలంగా
కలాం మీకు సర్వదా సలాం !

గిరిజ నూకల

# అణు మహా మనిషి

అణువణువున అణుశాస్త్రం
మహా మనిషికి చిన్నారి హృదయం

జ్ఞాన సముద్రం
ఇసుమంతైనా లేని అహం

ఆభరణమైన నిరాడంబరం
మతాతీతమైన మానవత్వం

చిరు అణువు విస్ఫోటం
నింగి కెగిసిన అభిమానం

మూడవ ప్రపంచ పేద భారతం
పెద్దల సరసన అగ్ర తాంబూలం.

గుండె లయలోనూ అబ్దుల్ కలాం
ప్రతి గుండెలోనూ అబ్దుల్ కలాం

భారత రత్న అయిన మహాత్ముడికి

అశ్రువుల మాలతో ఇదే మా శ్రద్ధాంజలి

అణువణువున లీనమై

భారతావనిని రక్షించు

నీతి లేని రాజనీతిలో

నీతి నింపి దీవించు.

**సిద్ధార్థ చౌదరీ కట్టా**

# Johar kalam ji

నింగిన విహరిస్తున్న పక్షిని చూసి

తానూ నీలి మేఘాల సరసున విహరించాలనుకున్నాడు

ఆ బాలుడు..

అనుకున్నదే తడవుగా

ధ్రుడనిశ్చయం తో..

చేకూరిన సంకల్పం తో..

ఆత్మవిశ్వాసం తో..

కలల తీరాన్ని చేరుకున్నాడు...

కాలగమనం లో ఆ పనోడే

కోట్లమందికి స్ఫూర్తయ్యాడు..

కలాం జీ ఇకనుంచి

భువి నుంచి దివికెగసే ప్రతి క్షిపణి లో

నువ్వుంటావ్..నవ్వుతుంటావ్... .....

ఆగష్టు 15 కో,జనవరి26 కో

ఓ 50 మందికి వినపడే మైక్ సెట్ తో ..

ఓ 1000 మందికి తెలిసిన 4గురు పెద్దలతో ..

ఓ 2000 మందికి పంచటానికి సిద్ధమయిన

మిటాయలతో ..

ఓ 2లక్షలు మంది చూసే జిల్లా పేపర్లో వేయించుకుని

ఆనందపడే నా దేశం లో నిజమయిన దేశ భక్తుడివి .....

పేరుకే పరిమితం కాని నా దేశపు ప్రధమ పౌరుడివి .....

మీ గురించి రాయగల శక్తి

మాట్లాడగల పరిజ్ఞానం చాలక

ఇలా ఇక్కడితో ఆగిపోతూ ........

చివరిగా ఒక్కమాట ...

కలాం జీ ..

మా అందరికీ చొక్కాలున్నాయ్

చొక్కాలకి జేబులున్నాయ్

వాటెనకాల ఓ గుండె ఉంది

అందులో మీ స్తానం సుస్తిరం

28/7/2015

**పాతూరి అన్నపూర్ణ**

# కవి మాత్రమే

కలలు కనేవాడే కవి

కలలలో మరోప్రపంచం నిర్మించే వాడే కవి

తనను విస్తరించుకుంటూ పోతూ

అనుసరిస్తున్న అడుగుజాడలకు

దిశానిర్దేశం చేయడం

సమాజానికి యేం కావాలో వెతకటం

కలుపు మొక్కలను యేరి పారేయడం

అక్ష రాలను అవిశ్రాంతంగా ఆరాధించడం

కవి మాత్రమే చేయగలడు

------------------

ప్రి యతమ కలాం గారికి అంకితం

సూర్య సూర్యదేవర

# దివికేగిసిన భారత రత్నం

త్రిమూర్తులకి ఏమి ఆశ కలిగిందొ..

జగన్మాతకి ఇలాంటి పూత్రుడు ఎందుకు కవాల్సి వచ్చిందొ

దెవెంద్రుడికి ఏ కొత్త ఆయుధం కవాల్సివచ్చిందొ

దిక్పాలకులకి ఏ కొత్త దిక్కు కవాల్సి వచ్చిందొ

దేవతలకి ఎందుకు కవాల్సి వచ్చిందొ దెవగునములు వున్న మానవుడు.

దివి లొ ఊన్న తారకి మరొక తార ఎందుకు అవసరమొచ్చిందొ

ఎది ఎమయిన , ఎమి జరిగిన

భారతమాతకి పుత్ర వియొగం కలిగింది, భారత ప్రజలు ఒక దిక్కుచిని కొల్పొయారు..

ఏ కడుపు కొత తుద్చలెనిది మాన్ పలేనిది..

**జానకీ తమిరిశ**

# అబ్దుల్ కలాం

పిల్లలలో పిల్లవాడిలా

కలిసిపోయే కలాం

కదిలిపోయావా

గగనానికి

తారలలో తారలా

మెరిసేందుకు !

సాటిలేని వ్యక్తిత్వానికి

వెల్లివిరిసే విజ్ఞానానికి

ఉదాహరణనీపై

ఉత్తమోత్తమ జన్మ నీదై

పులకించింది

భరతావని !

జననమరణాలు

సహజమేకాని

నీవు తరలిపోవడం

తట్టుకోలేకున్నాము !

సలాంతో సరిపెట్టుకోమంటావ

అబ్దుల్ కలాం మమ్ములను !

28-7-2015

మంజు యనమందల

# రాలిపడింది వెన్నెల కెరటం....!!

వేల యుగాల నిరీక్షణకు
దొరకని సమాధానాన్ని
ఎక్కడో వెదుకుతున్నా

వాడి పోయిన పువ్వుల్లో
తరగని పరిమళాన్ని
ఆస్వాదిస్తూనే ఉన్నా

స్తబ్దంగా మారిన మదిలో
నిస్సత్తువగా నిలబడిన
వాస్తవాన్ని చూస్తున్నా

చితికి పోయిన జ్ఞాపకాలలో
నీలి నీడల చిత్రాల కోసం
తరచి తరచి పరికిస్తున్నా

నువ్వు వదలి పోయిన
గత గవాక్షంలోనే ఎదురుచూస్తూ
అక్షరాలతో సహా జీవనం చేస్తున్నా

రాలిపడిన వెన్నెల కెరటంతో
మరో పున్నమిలో చెలిమి చేద్దామని
వేకువ వెన్నెల రెక్కల చాటుకు చేరా

పరుగులెత్తుతూ వెళిపోతున్న కాలంలో
నువ్వు లేని క్షణాలను నిరాకరిస్తూ
జీవితానికి అర్ధాన్ని మరచి పోతున్నా...!!

**శ్రీ గాజుల**

# కలాం సారు సలాములు

## సలాములు సలాములు

## కలాం సారు సలాములు

## కలలను మరచిన కాలంలో

అలలను పరచిన సంద్రం నీవే

సలాములు సలాములు

కలాం సారు సలాములు

ఈ దేశపు ప్రతిభకు

రెక్కలు తొడిగిన రాకెట్ నీవే

పేపరు వేసిన చేతులతోనే

ప రిపాలన శిఖరపు అంచును తాకావు

సలాములు సలాములు

కలాం సారు సలాములు

చదువుల తోటలో

పూసే పువ్వుల నవ్వులు నీవే

చీకటి బడిలో వెన్నెల కురిసే

కిరణపు జల్లువు నీవే

సలాములు సలాములు

కలాం సారు సలాముల..

28/7/15

**వరప్రసాద్ వాసల**

# నివాళి...!

నీది నిరంతర చైతన్య ప్రయాణం...!

నీవు ఎక్కడికెళ్లినా... ఎందుకెళ్లినా...

మెదళ్లని కదిలించడమే నీ పని..

నీవు భారతావని తరగని గని...!

నీవు పేపర్ బాయ్ నుండి

అధ్యక్ష సౌధానికి ఎదిగిన తీరు..

నీ సహజ నాయకత్వానికి తార్కాణాలు.!

నీవు భుజాలపై ఎత్తుకున్న స్వప్నాలు

రక్షణ పొదలో చెక్కిన శిల్పాలు...

ఈ దేశ భావితరానికి పునాదులు...!

నీవు ఎన్ని ఎత్తులు చూసినా

అంతగా ఒదగడం నీకే చెల్లింది..

అవార్డులకూ నీతోనే గౌరవం దక్కింది..!

నీవు విద్యార్థిగా ప్రయాణం మొదలెట్టి
విద్యార్థులకు భోధిస్తూ నేలకూలడంలోనే, నీ జీవన
సందేశం దాగి ఉంది...!

నీ శరీరం విశ్రమించినా...
నీవు వెలిగించిన విజ్ఞాన దీపాలు...
నిరంతరం వెలుతురులు పంచుతాయి..
నీకు నిత్యం నివాళులు అర్పిస్తాయి...!

అబ్దుల్ కలాం...
అందుకో ఈ దేశపు కన్నీటి సలాం...!

**కొత్త అనిల్ కుమార్**

# మళ్ళీ రా

ఎప్పటికైనా జరుగుతుందని తెలుసు

ఈ విస్ఫోటనం

ఎవరం కూడా ఎంత కాలం

ఆపలేము కదా

ఐనా ఎక్కడి వరకు పోగలవు నువు

విశ్వమంతా వ్యాపించి వున్న

నీ కీర్తిలో...

ఈ మరణం 'అణు'మాత్రమే

మళ్ళీ పుడతావు నువు

పుట్టాలని మేం కోరుకోకునా

జరిగే మహా పరిణామమే

నీ లాంటి త్యాగదనుల జననం

వెళ్ళి పోతున్నాననుకుంటున్నావు కదా!

మళ్ళీ వస్తావులే...

ఈ నివాళులు

రేపటి నీ రాకకు స్వాగతాలనుకో...

రా...వెళ్ళినట్లే వెళ్ళి ... మళ్ళీ , రా..

నిన్ను కలుపుకునే ఈ మట్టి

కలలు కంటుంది

మళ్ళీ నువు పుట్టాలని..

28/7/2015

ఆచంట హైమావతి

# సుజ్ఞాన వేత్త

మహా మనీషీ - మా కలాం మహా శయా...!

ఏ లోకానికి నీ పయనం ?---?

ఏ రాష్ట్రానికి నీ ఉపన్యాసం?---?

మేమంటే ఏవగింపు కలిగిందా సోదరా!?!

నీ నిరాడంబర తత్త్వం ,

నీ చిత్తశుద్ధి తత్త్వం ,

నీ దేశ భక్తి తత్త్వం ,

నీ సహృదయ తత్త్వం...ఇలా --

ఎన్నని వర్ణించగలమయ్యా?

ఓ భారత భాగ్య మహర్షీ!

ఓ భారతోన్నత యశశ్చంద్రా!

ఓ ఉ జ్వల విశాల హృదయా!

తిరిగి ఎప్పుడు నీరాక ?
మరల జన్మ్మందా నీకు?
భారతీయుడపై మరలిరావయ్యా ?
మమ్ము్మలను మరువకు సోదరా!

నీ సలహాలకై మేము వేచి ఉంటాము!
నీ రాకకై మేము ఎదురు చూస్తాము!
నీ కార్య దక్షతకై లోకంఎదురు చూస్తుంది!
నీ సామరస్యవర్తనకు లోకం " జై " కొడుతుంది!

జై జై జై జై "జాతి" వైభవ మహితా!
జై జై జై జై భారత ప్రియ పుత్రా !
జై జై జై జై విజ్ఞాన మకుట ప్రమాణా!
జై జై జై జై సుహృద్భావ విజ్ఞానవేత్తా!
జోహార్లు మహామాన్యా జోహార్లు నీకు!!!

చిన్న మల్లెల

# సుధీర్గ ప్రతిభా కెరటం

84 ఏళ్ళ సుధీర్గ ప్రతిభా కెరటం
ఒక్కసారిగా వాలిపోయింది

ఊరి చివర ఓ తరగతి గదిలో
చివరి బల్లపై కుర్రకారుకు
వాడి భవిష్యత్ ఏంటో తెలియని
పరిస్తితిలో నువ్వు ఇచ్చిన భరోసా
వాడి గుండెల్లో ధైర్యాన్ని నింపింది
హాట్సాఫ్ మిత్రమా !! హాట్సాఫ్
ఈ రోజు నువ్వు ఇక్కడ లేకపోయినా
నువ్వు మా గుండెల్లో సుభాషితమై
ఉండిపోతావులే పదిలంగా.

వెళ్లిరా మిత్రమా !!
ఇకపై నీ ప్రయాణం శాంతిగా
విశ్రాంతి కలగాలని

మనః పూర్వకముగా

ఆశిస్తున్నా

28 Jul 2015

అందె శ్రీధర్ రెడ్డి

# అబ్దుల్ కలాం

# అద్భుత కలాం

శాస్త్రానికి అస్త్రమయ్యి -తిమిరంతో సమరమయ్యే

విజ్ఞానపు గమనమయ్యి- విహం గాన క్షిపణులయ్యే

హృదయాలకు స్పందనయ్యి- చైతన్యపు జ్వాలలయ్యే

స్వప్నాలకు రూపమిచ్చి- సాకారం సాధ్యమయ్యే

కిరణానికి దారి చూపి- జగమంతట దృశ్యమయ్యే

పరిశోదన ప్రాణమయ్యి- నవ సృష్టికి మూలమయ్యే

బోధన కే బుద్ధుడయ్యి – పాఠాలకు జీవమయ్యే

మాటలన్నీ మంత్రమయ్యి – యువతరాన జవమయ్యే

అణుపరీక్ష( పోక్రాన్ ) విజయమయ్యి - భారతి నవ శకమయ్యే

నిప్పు సెగల రెక్కలయ్యి - విశ్వమంత వెలుగు జిమ్మి

- భారతమ్మ రత్నమయ్యే

రాష్ట్రపతిగ రాజుడయ్యి – ప్రజా సేవ శరణమయ్యే

బాలలలో భవిష్యత్తు చైతన్యం రగిలించే

భోదిస్తూ భోదిస్తూ సెలవంటూ సెలవంటూ ......

**సుభాషిణీ తోట**

# కలాం .........

ఎక్కడో ఉన్న భారతావని భవిష్యత్తుని నింగికి చాటిన మహానీయుడా ...
భారత రత్నకు మణిమాణిక్యాలద్దిన మొదటి పౌరుడా ...
మిస్సైల్ నీ నవ్వుల్లో నాట్యం చేస్తూ ఆకశాన్ని తాకేలా చేసిన నిగర్వుడా...
సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మిస్సైల్ మాంత్రికుడా..
సమస్యలను సవాలుగా స్వీకరించిన ఓ అతిరధుడా....
శ్రీ రాగాన్ని ప్రేమించిన మిత భాష్యుడా ....
ఆనందం అంతా మనసు భాషే అని తెలిపిన అందగాడా ....
కలలకు ప్రాణం పోసిన అభినవ వాల్మీకుడా .......
ఎన్ని బిరుదులు ..
మరెన్ని కొలువులు ...

ఇంకెన్ని డాక్టరేట్లు ....

ఎంత కీర్తించినా ...

మరెంత గౌరవించినా ....

నీ సౌమ్యత ముందు అవన్నీ మట్టి బొమ్మలే ...

గాంధీ ని చూడలేకపోయమేమో ....

కాని నీలాంటి మహనీయుడిని చూసిన మా కన్నులు

ఎప్పటికీ ఆరిపోని కార్తీక దీపాలే ......

ఏ దేశానికి లేని గొప్ప వరం ....

భారతానికే మిగిలిన మంచి హృదయం ....

నీ ఆశీస్సులు మాకు అందడం ....

హాయిగా కదలిపో ఓ దార్శనికుడా ...

మాలో ఉండిపో సుభాషితుడా....

మరణం తప్పదు ఎప్పటికీ ....

ఆ తరుణం వచ్చింది నేటికి ....

కాని మేమంతా నీ కలల నెల రాజులం ....

నైపుణ్యమే నీ ఆయుధం ....

మేమంతా కలిసికట్టుగా నిలబెడతాం ఆ యుద్ధఫలితం ....

కన్నీరు రానివ్వం ........

కలిసికట్టుగా కదులుతాం....

ఇదే మేము నీకిచ్చే నివాళి ....

జైహింద్ .....జై జై కలాం .....

**చౌదరీ ఎం.వీ.**

# జోహార్లు

కపట వేషధారులతో కప్పివేయబడిన ఈ లోకంలో అతి

సామాన్య వ్యక్తి నింగికెగసే శక్తిగా రూపాంతరము చెందిన

ఒక మహా సంకల్పము,అకుంఠిత దీక్షా దక్షిత,అజరామర

యశో పతాకంబు,అవ్యాజ ప్రేమ సముద్రంబు,అచంచల

దేశ

భక్తి,అమోఘ గ్రహాంతర సంచాలన శక్తి,అరివీర భయంకర

క్షిపణి తయారు యుక్తి,పిన్నలకు అపార ఆప్యాయ స్ఫూర్తి,

పెద్దలకు అడుగడుగునా ఆదర్శ మూర్తి,భరతమాత తేజో

వికాశ దీప్తి,భారతీయుల జన్మాంతర ప్రాప్తి,విద్యా వినయ

శీలుర ఆర్తి,విమలానంద చరిత కీర్తి,అట్టి నిరాడంబర

నిరుపమానుండు,నిఖిల జగతిని నిట్టూర్పు లో ముంచి

నింగి కెగసిన అబ్దుల్ కలాం అమర్ రహే అమర్ రహే !!!

**సారెడ్డి శ్రీనివాస రెడ్డి**

సత్యం ఆగిపోయింది ... ధర్మం నిలిచిపోయింది ...శాంతి అదృశ్యమైంది.
నీతి, నిజాయితీ ఆవిరయ్యింది. మార్గం చెప్పే వాక్కు మూగబోయింది ..
మంచితనం తనువు చాలించింది.... భరతఖండపు జాతికి వెలుగునిచ్చిన కాంతిపుంజం రాలిపోయింది...
విశ్వ ఖ్యాతి గడించిన భారత మిస్సైల్ గగనానికి ఎగిసింది... అఖండ జ్ఞానతేజం దివాకరునిలో ఏకమయ్యింది. ముద్దు బిడ్డ ఇక లేడని భరతమాత కంట నీరు పెట్టింది .
మీరులేరనే బాధ వెంటాడుతున్నా... మీరు చేసిన చివరి పయనం నన్ను ఆలోచనలోకి నెట్టి వేసింది.
మహత్తరమైన రోజు తొలిఏకాదశి నాడు సూర్యుని కి తోడుగా ఒకే సమయమే మీరు అస్తమించడం విశేషం. ఇది భగవత్ స్వరూపులకేసాధ్యం. ఓమహానుభావా..మీ స్వరూపం పురుష తత్వం.. మీ శిర సిగపై మధ్య పాపట స్త్రీ తత్వం.

మీ కల్మషం లేని మనో రూపం బాలతత్వం మొత్తంగా కలగలిపి మూర్తిభవించిన ఈశ్వరతత్వం. మీ పాదాలు తాకలేక పోయాయి నా చరములు .. ఎన్నో విధాలుగా ప్రయత్నిచా.. దర్శించే భాగ్యంలేకపోయింది . నా కోసం అంటూ మీరు ఒక సమయం ఇచ్చినా కలవలేని దురదృష్ట వంతున్ని .... నాజీవితం లో నేను ఏదైనా కోల్పోయాను అంటే ఇదే .... మళ్లీ వస్తా రా మహానుభావా... .... కాలం విలువ రాసిన కలమా... గురుపై ఆదర్శంగా నిలిచినా కలామా ... 2020 చూడకుండా వెళ్ళారే.. నాలోని ఆవేదన సంద్రాన్ని ఎంతని చెప్పడం ఎలా అని చూపటం ...ఇంతకన్నా నేను ఏమి చెప్పను ... చెప్పలేను .....

**భవభూతి శర్మ జమ్ములమండ**

# నిప్పురెక్కల మనీషి

''కల అంటే నిద్రలో కనేది కాదు

నిద్రరాకుండా చేసే లక్ష్యం ''

పెద్దపెద్ద ఆలోచనలు చేయండి

చిన్నవి చేయడం ఆత్మ హత్యకి సమానం ''

మీరు చెప్పిన ఈ మాటలు గుర్తొస్తున్నాయి

కలాం మహాశయా ఈ నాడు .

ప్రజల అధ్యక్షుడు గా ప్రసిద్ధుడు

క్షిపణిలా నింగికి ఎగిసిన

నిప్పురెక్కల మనీషి .''

wings of fire రచయిత

**పి. లక్ష్మణరావు**

# అద్భుత సలాం

**అబ్దుల్ కలాం**

**అద్భుత సలాం**

**ఆత్మవిశ్వాసానికి నిలువెత్తు సాక్ష్యం**

దృడసంకల్పానికి కొండంత నిదర్శనం

స్వయం కృషే ధ్యేయం

పురోగతే లక్ష్యం

రక్షణ వ్యవస్థలో ఉక్కు కవచం

అంబులపొదిలో 'అగ్ని'శరం !

ఆదర్శాలు ఆచరించిన మార్గదర్శి

ఆచరణే శ్వాసించిన తపస్వి !

కలలను సాకారం చేసిన కార్యసాధకుడు

ప్రగతికి ఆకారం దిద్దిన పరిశోధకుడు !

విజయం నీకు గులాం అయింది

అపజయం నిన్నుచూసి భయపడింది

స్ఫూర్తి ప్రదాత ! ప్రేరణ విధాత !

నీ మరణ వార్త మాకు చేదునిజం

నీవులేని ప్రయాణం అతివిషాదం

అయితే ఒక్క విన్నపం !

మేము అంతరిక్షం వచ్చినప్పుడు

నీవే స్వాగతం పలకాలి

మేము చంద్రయానం చేసినప్పుడు

నీవే ఆతిధ్యం ఇవ్వాలి ! అయినా... మా భ్రమగాని

శాస్త్రవేత్తలకు మరణము ఉంటుందా!

సృష్టికర్తలకు మృత్యువుంటుందా !

జయజయహే అద్భుత సలాం

అమర్ రహే అబ్దుల్ కలాం !

(27-7-2015 న దివంగతులయారని తెలిసిన క్షణం )

**విశ్వనాథరెడ్డి**

# సలాం .. కలామ్

సలాం .. సలామ్

కలాం ..కలామ్

కలలు మా కనులకిచ్చి

సాకారాలు మా కళలకి చ్చి

నవ్వులు పిల్లలకిచ్చి

నడకలు వాళ్ళ కేరింతలకిచ్చి

మాటలు పాఠాలు గా మార్చి

ఆలోచనలను ఆటలలో కూర్చి

ఎక్కడ ఏ సమావేశంలో వున్నా

మనసును వాళ్ళకే అంకితమిచ్చి

దీర్ఘ సెలవులో వెళిపోయా వా ..!

నేలతల్లి నిన్ను కోరుకుందో ఏమో ..!

అమ్మా నేను నీ వాడిని ..

నీకే కష్టం వచ్చింది తల్లీ..!

ఇదిగో నే వస్తున్నా అంటూ

వెళిపోయావ్ ..!

సహనానికి మారు పేరుగా

నిలిచిన నేలతల్లి

మా పాపాల ప్రతాపాలతో

తాపం పెరిగి

శాపాలకు సిద్ధంగా వుంది కదూ ..!

అమ్మకు చెప్పు

భవిష్యత్తు అంతా...

మా పిల్లలు నీ కలల, కళల

సాకారం కోసం

నీ ఆలోచనల ఆకారాల

ప్రాకారాలుగా .. రూపుదిద్దుకుంటూ

పెరుగుతారని....

అమ్మ చేతిలో చెయ్యేసి చెప్పు

ఆమెను శాంతిగా ఉంచే

అహింసా పావురాలుగా

నీ స్ఫూర్తితో ఎగురుతామని

నీకు మేము హామీ ఇస్తున్నాం.

**శ్రీచమస్ మధు**

# నిప్పులు చిమ్ముకుంటూ

నిప్పులు చిమ్ముకుంటూ నింగికి

నీ క్షిపణులు ఎగిరిపోతే

నిబిడాశ్చర్యంలో ప్రపంచం

మౌనంగా వేదికపై

నీవు కూలిపోతే

నిస్తేజంగా మేము

కలలకు రెక్కలు తొడిగి

క్షిపణులకు ప్రాణంపోసి

విజ్ఞానశాస్త్రం

విధిరాతను తిరగరాసి

ఓ సృష్టికర్తా!

నీ స్ఫూర్తి

భారతజాతి కీర్తి

నిఖిలమై..అఖిలమై

నిత్యమై వెలుగుతూనే ఉంటుంది.

కలాం నీకు సలాం

(28.07.2015)

నాగరాజు భుక్యా

# నా దేశపు కల " కలాం " అస్తమించాడు

స్వప్నం
మహాస్వప్నం

నిప్పుల రెక్కల పిల్లలు
ఉపగ్రహాలతో ఆడుకుంటున్నారు

హిమాలయ శిఖరాల్లా దేశశిరస్సు చుట్టూ
క్షిపణుల ఖగాల యువకులు
పహారా పక్షుల్లా ఎగురుతున్నారు

భరతఖండ సింహాసనంపై
కడగొట్టుబిడ్డ పాదుకలు పాలిస్తున్నాయి

దరిద్రదేవత నోడించిన భరతరత్నాన్ని కని
కాషాయం, ధవళం, ఆకుపచ్చ తన ముగ్గురమ్మలు

హిందూమహాసముద్రం,అరేబియాసముద్రం,

బంగాళాఖాతాల్లా

ఆనంద,గర్వకెరటాలతో గౌరవవందనం చేస్తున్నాయి

ప్రస్థానం

మహాప్రస్థానం

కన్న కలల గుర్రాలను

విశ్వవిజయయాత్రలకు పరిగెత్తిస్తూ...

చెరగని పాదముద్రలను దానమిస్తూ...

విశ్వవిద్యాలయాల్లో మహాశక్తులను వెలిగిస్తూ...

ఓ ఫకీరు జీవనవీణ తీగ తెగిపోయింది

తన ప్రయాణాన్ని పరిపూర్ణ ఫలప్రదం చేసి

నా దేశపు కల "కలాం" అస్తమించాడు

నివాళి

మహానివాళి

విద్రోహశక్తులు భీతిల్లేలా

ఓ రెండు క్షిపణులు పరిక్షీద్దాం

ప్రపంచ పెద్దన్నలు, మావయ్యలు తలలొంచేలా

ఓ నాలుగు శాటిలైట్లు ఎగరేద్దాం

# సలాం

దేశ కలల సాకార రూపం

బ్రతుకే ఒక ఆదర్శ గ్రథం

కుల మత రాజకీయాలకు అతీతం

జీవితమంతా దేశం కోసం

మా గుడెల నిడా నీ ప్రతి రూపం.

కలాం ! నీకు సలాం !!

**రాజు మురలశెట్టి**

మహానుభావులకు మరణం రాదు..

స్ఫూర్తి ప్రదాతకు చరమం లేదు

జరా మరణ సంప్రదాయం...

నీ భౌతిక మూర్తిని దూరం చేసినా...,

నీ జ్ఞాన సౌరభములకు అంతం లేదు.

నీ కీర్తి తరంగములకు క్షీణం రాదు.

జాతి మతాలకు అతీతుడిగా ...

భారతమాతకు ముద్దు బిడ్డగా....

నీ సేవలు మరువరానివి...

నీ రాతలు మహోన్నతమైనవి.

గతాలు మారినా..

నీ ఘనతల చరిత శిథిలం కాదు..

తరాలు గడిచినా..

ఈ కర్మ భూమి నిను మరువజాలదు.

మిస్సైల్ మాన్ కు అశ్రు నివాళి.

పద్మా కుమారి

# రాలిన జ్ఞాపకం

పవళింపు లేని నిశీధిలో
దాచిపెట్టుకున్న పరిమళాలన్నీ
తనువునొదిలేస్తుంటే ....

ఏకాంతంలో బిక్కుబిక్కుమంటూ
బిక్కచచ్చిన సుమ బాలలా
నిశ్శబ్ద ఎదవీధిలో నిర్భీతిగా రాలుతోందొక జ్ఞాపకం

ఎందుకని నన్నడక్కు
కడగండ్ల భారాలెన్నో మోసి మోసి
ఎర్రబడిన నా చెక్కిళ్ళనడుగు....
అవమానం మింగిన మనసు చెపుతుంది

స్వార్థప్రయోజనాలెరుగక
అమాయకంగా చేరదీసిన చెలిమినడుగు
ముక్కలైన నా మనసు చెపుతుంది

అసూయాగ్నుల్లో రగిలి

నుసైన నా అక్షరాలనడుగు

కలత మింగిన కధలన్నీ చెపుతుంది..

ఖచ్చితంగా ఇరవైమూడేళ్ళుగా

అలవోకగా ఎడాపెడా వ్రాసేసి

ఇప్పుడు మొరాయిస్తున్న భావకన్నియనడుగు

చంపబడ్డ సిరాచుక్కల జాడ చెప్తుంది

అందుకే చెప్తున్నా ...

నేల రాలిన పరిమళం

నాసికకందదు ....

చిదిమివేయబడ్డ భావనా సుమం

చిగుళ్ళేయదు....

కొత్త తోటకు పో నా కలమా


తూర్పు తీరం తెలియకుంటే

పడమర తీరం తరలుతూ

మోసమెరుగని కలాల చెలిమిలో

పునర్జీవనం చేస్తూ....

27 July 15


నీవొక పచ్చని చెట్టయితే
నీవొక పచ్చని చెట్టయితే
పిట్టలు వాటంతట అవే వచ్చి వాలేను.
పిట్టలు వాటంతట అవే వచ్చి వాలేను.
జయహో కవిత్వం...
జయహో కవిత్వం...